క్లుప్తంగా

కేటీఆర్‌ను కలిసిన నాయకులు



కేటీఆర్‌తో రేగా కాంతారావు, నాయకులు, కార్యకర్తలు

జూలూరుపాడు: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో బుధవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆధ్వర్యంలో నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ను బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబును నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వైరా నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండాలని కేటీఆర్ సూచించినట్లు గిరిబాబు తెలిపారు.

కేఓసీకి ప్రథమ బహుమతి



సంబురాలు చేసుకుంటున్న అధికారులు, ఉద్యోగులు

టేకులపల్లి: సింగరేణి స్థాయి 55వ వార్షిక రక్షణ వార్షికోత్సవాల బహుమతుల ప్రదానం ఇటీవల శ్రీరాంపూర్‌లో జరిగింది. టేకులపల్లిలోని కోయగూడెం ఓసీ మొదటి బహుమతి సాధించింది. ఈ మేరకు బుధవారం కేఓసీలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కార్మికులు, ఉద్యోగులు, అధికారులు సంబురాలు జరుపుకున్నారు. కేఓసీ మేనేజర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇదే ఒరవడిని కొనసాగిస్తూ ముందుముందు కూడా ఉత్పత్తితోపాటు రక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఇతర గనులకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ యు.బ్రహ్మం, అడిషనల్ మేనేజర్ రవికుమార్, సీనియర్ అండర్ మేనేజర్ కే.నరసింహారావు, వెల్ఫేర్ ఆఫీసర్ అశోక్, గుర్తింపు సంఘం నుంచి కే.వెంకటేశ్వర్లు, ప్రాతినిధ్య సంఘం నుంచి బి.నాగేశ్వరరావు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాలేజీలో పాము కలకలం



పామును పట్టుకున్న సంతోష్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం పాము కలకలం సృష్టించింది. కళాశాల ఒకేషనల్ ఎలక్ట్రికల్ తరగతి గదిలోకి పాము రావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. ప్రిన్సిపాల్ కత్తి రమేష్ ఇచ్చిన సమాచారంతో స్నేక్ రెస్క్యూ ప్రతినిధి సంతోష్ చేరుకుని పామును బంధించి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు.

విషజ్వరాలు.. వణుకుతున్న పల్లెలు

- రోగులతో ప్రభుత్వాస్పత్రి కిటకిట
- సౌకర్యాల లేక అవస్థలు



జూలూరుపాడు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జర్వబాధితులు

జూలూరుపాడు: మండలంలోని పల్లెలు జ్వరాలతో వణికిపోతున్నాయి. జ్వరం, కీళ్ల, ఒంటి నొప్పులు, జలుబు, దగ్గు సీజనల్ వ్యాధుల బారినపడి ప్రజలు విలవిలలాడుతున్నారు. అదేవిధంగా డెంగీ, టైఫాయిడ్, చికెన్ గున్యాతోనూ పలువురు ఇబ్బంది పడుతున్నారు. గత రెండు వారాల్లో వాగొడ్డుతండా, మాచినేనిపేట, గోపాతండా, పడమటనర్సాపురం గ్రామాల్లో ఆరు డెంగీ కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్న విషయం. ఆ పల్లెల్లో ఏ గడప తొక్కినా జ్వరంతో బాధపడుతున్న వారే కన్పిస్తున్నారు. దీంతో రోగులు స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వస్తుండటంతో కిటకిటలాడుతోంది. మూడు వారాలుగా విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు విజృంభణతో ప్రభుత్వాస్పత్రికి ప్రతీరోజు 150 నుంచి 200 మంది పైగా వైరల్ ఫీవర్, సీజనల్ వ్యాధులతో వస్తున్నారు. కానీ సౌకర్యాలు లేకపోవడంతో రోగులు అవస్థలు పడాల్సి వస్తోంది. రోగులకు సరిపడా బెడ్లు లేకపోవడం, కనీసం కూర్చోవడానికి కుర్చీలు సైతం లేవు. మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురికావడంతో తాగడానికి నీళ్లు కూడా లేవు. స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్లు, వైద్య సిబ్బంది కొరత ఏర్పడటంతో సరైన వైద్యసేవలు అందడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో నలుగురు వైద్యులు, ఒక డెంటిస్ట్‌తో ఐదుగురు డాక్టర్లు ఉండాల్సిన ప్పటికీ ముగ్గురు వైద్యులు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఇద్దరు వైద్యులు ఇటు ఆస్పత్రి, అటు గ్రామాల్లో జ్వరాలు వ్యాప్తి పెరగడంతో వైద్యశిబిరాలు నిర్వహించాల్సి వస్తుండటంతో ఇబ్బందిగా మారింది. అదేవిధంగా మూడు స్టాఫ్ నర్సు పోస్టులు, ఒక హెడ్ నర్సు పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఇద్దరు స్టాఫ్ నర్సులు పని చేస్తున్నారు. గ్రామాల్లో జ్వరాలు పెరుగుతుండడంతో అవకాశంగా తీసుకున్న ఆర్ఎంపీలు తమ స్థాయికి మించి వైద్యసేవలు అందిస్తుండటంతో రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. వైరల్ ఫీవర్లే ఎక్కువగా వ్యాప్తి చెందినప్పటికీ ఆర్ఎంపీలు డెంగీ, టైఫాయిడ్, చికున్ గున్యా వ్యాధులు అని చెప్పి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు పలువురు వాపోతున్నారు. ప్రభుత్వాస్పత్రిలో వసతులు కల్పించడంతోపాటు, మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులకు మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం..



ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. రోజుకు 200 పైగా ఓపీ ఉంటోంది. సీజనల్ వ్యాధుల సమయం కావడంతో పేషెంట్ల సంఖ్య పెరిగింది. కలెక్టర్, డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు గ్రామాల్లో వైద్యశిబిరాలు, ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నాం. అదేవిధంగా హాస్టల్, ఆశ్రమ పాఠశాల, కేజీబీవీల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ వెంకటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ జూలూరుపాడు

'స్థానికం'లో సత్తా చాటుదాం..



మాట్లాడుతున్న దేవా

ఇల్లెందురూరల్: సమన్వయంతో పనిచేసి త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామని బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు శీలం రమేష్, ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి రేణుక అన్నారు. స్థానిక ఎన్నికల సన్నద్ధతలో భాగంగా పార్టీ మండల శాఖ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. పంచాయతీల వారీగా బాధ్యులు పలు అంశాలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ప్రతీ గ్రామంలోనూ క్రియాశీలక కార్యకర్తలు ఉన్నారని, పార్టీ బాధ్యులతో పాటు వారిని కూడా సమావేశాలకు ఆహ్వానించి పార్టీ కార్యక్రమాలలో భాగస్వాములను చేయాలని, తద్వారా ప్రతీ గ్రామంలో పార్టీ విస్తరణ, నిర్మాణాత్మకంగా బలోపేతం చేయాలన్నారు. గ్రామపంచాయతీ స్థాయిలో నూతన కమిటీలు వేయాలని సూచించారు. పార్టీ మండల శాఖలో వర్గవిబేధాలు లేకుండా క్రియాశీలకంగా పనిచేసే వారిని గుర్తించి బాధ్యతలు అప్పగించాలని కోరారు.

నాయకుల ముందస్తు అరెస్టు

పాల్వంచరూరల్: చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో బుధవారం పోలీసులు పలువురు నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. బీజేపీ అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు, ఉద్యమకారుల ప్రధాన కార్యదర్శి బుడగం నాగేశ్వరరావు, ఆశ వర్కర్ అధ్యక్షురాలు మాలోతు రాధ, సీపీఎం నాయకులు సత్యనారాయణ, సత్య తదితరులను పోలీసులు అరెస్టు చేసి, సాయంత్రం వదిలిపెట్టారు.

అక్రమ అరెస్టులకు ఖండన

జూలూరుపాడు: సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా సీపీఎం నాయకుల అక్రమ అరెస్టులను గిరిజన సంఘం బానోత్ మధు తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సీపీఎం వ్యతిరేకం కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడతామని సీఎం చెప్పారన్నారు. అర్ధరాత్రి సీపీఎం నాయకులను పోలీసులు అరెస్టు చేయడం గర్హనాయమన్నారు. రైతు సమస్యలు పరిష్కరించడం, సీతారామ నీళ్లు జిల్లాకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

టేకులపల్లి: అరెస్టులతో ఉద్యమాలను అణిచివేయలేరని సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా రవి రాథోడ్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో తనను టేకులపల్లిలో, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు, జిల్లా కార్యదర్శి బాదావత్ సురేష్‌లతో తదితర నాయకులను జిల్లా కేంద్రంలో అరెస్టు చేశారని తెలిపారు. ఎలాంటి కార్యక్రమాలు చేయకపోయినా ముందస్తుగా అరెస్టులు చేయడం అన్యాయమన్నారు.

ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సిలింగ్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య ఆదేశాల మేరకు బుధవారం ఇల్లెందు ఎస్ఓటూ జీఎం కార్యాలయంలో క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఓటూ జీఎం రామస్వామి, డీజీఎం పర్సనల్ తుకారాం ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించి క్వార్టర్లు కేటాయించారు. అలాట్‌మెంట్, క్వార్టర్ల మార్పు అంశాలకు ప్రాధాన్యమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ నరసింహరాజు, జూనియర్ అసిస్టెంట్ జి.వీరన్న తదితరులు పాల్గొన్నారు.

రైతుల అవస్థలు పట్టని ప్రభుత్వాలు

కొత్తగూడెంఅర్బన్: మార్కెట్‌లో దళారులు రైతులను నిలువు దోపిడీ చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తోందని సీపీఐ(ఎంఎల్) ఎన్‌డీ రాష్ట్ర సెక్రెటరీ అశోక్ ఆరోపించారు. బుధవారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్చి, వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. తెలంగాణ రైతులకు యూరియా అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతుల అవస్థలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

పాల్వంచరూరల్: మండలంలోని జాతీయ రహదారిపై డివైడర్‌ను ఓ కారు ఢీకొనగా అందులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఖమ్మం నుంచి పాల్వంచ మీదుగా నలుగురు ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తున్నారు. బుధవారం తెల్లవారుజామున ఆరోగ్యమాత చర్చి వద్ద ఈ ప్రమాదం జరిగింది. కారు ముందు భాగం దెబ్బతింది.

పుస్తక పఠనంతో మేధోశక్తి



మాట్లాడుతున్న హెచ్ఎం సవిత

కొత్తగూడెంఅర్బన్: పుస్తకాలు చదవడం మంచి అలవాటని, మనుషులను మేధావులుగా తయారు చేసేవి పుస్తకాలే అని గ్రంథ పాలకురాలు మణి మృదుల అన్నారు. గ్రంథాలయ బాటలో భాగంగా చుంచుపల్లి పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయాలపై అవగాహన కల్పించేందుకు స్థానిక జిల్లా గ్రంథాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల హెచ్ఎం గోరంట్ల సవిత మాట్లాడుతూ గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలని, ఇక్కడ వివిధ రకాల పుస్తకాలు ఉంటాయని, ఇక్కడ చదువుకుని ఎంతోమంది ఉన్నత స్థానాలకు ఎదిగారని చెప్పారు. చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ, ఒక విలువైన పుస్తకాన్ని కొనుక్కోని చదువుకో అనే సిద్ధాంతం ప్రకారం విద్యార్థులంతా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోటీ పరీక్షదారులు, పాఠకులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రికి బంజారాల లేఖ

జూలూరుపాడు: టీటీడీ దేవస్థానంలోని శ్రీ హాతీరామ్ బాబా ఆలయ పరిరక్షణ, ప్రాముఖ్యత కోసం, మఠాన్ని బంజారా జాతికి అంకితం చేయాలని కోరుతూ బంజారా రాష్ట్ర నాయకుడు బానోత్ నవీన్ రాథోడ్ లేఖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. బుధవారం జూలూరుపాడులో మాట్లాడుతూ కొంతమంది దుష్టశక్తులు బంజారా ఆరాధ్యదైవమైన శ్రీ భతీరామ్ బాబా మఠం పవిత్ర స్థలాన్ని కూల్చివేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. శ్రీవారి భక్తుడు హాతీరామ్ బాబా మఠంలో బంజారా సాధువులు, సన్యాసులు నిత్య పూజలు, భజనలు, ఆరాధనలు నిర్వహిస్తూ హిందూ ధర్మ పరిరక్షణలో భాగమయ్యారని చెప్పారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత, భక్తి సంప్రదాయాల పరిరక్షుడిగా చర్యలు తీసుకొని, బంజారా సమాజానికి న్యాయం చేయాలని మోదీకి విన్నవించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి..



ఏజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: మూడేళ్లుగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు పలు సమస్యలు పరిష్కారం కాక ఇబ్బంది పడుతున్నారని ఏఐటీయూసీ కాంట్రాక్టు కార్మికుల ఇన్‌చార్జ్ జి.వీరస్వామి తెలిపారు. బుధవారం కొత్తగూడెం ఏరియా సివిల్ డిపార్ట్‌మెంట్ ఏజీఎం(సివిల్)కు వినతిపత్రం అందజేశారు. వీరస్వామి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు వైద్య సదుపాయం సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారని వారికి వెంటనే మెరుగైన వైద్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా కాంట్రాక్ట్ కార్మికుల సీఎంపీఎఫ్ పుస్తకాలతో పాటు వాటి లెక్కలు కూడా మూడేళ్లుగా చెప్పడం లేదని, వెంటనే లెక్కలు చెప్పి వారికి పుస్తకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు యూనిఫాం, షూ, గ్లౌజ్‌లు లేక ఇబ్బందులకు గురవుతున్నారని, వీలైనంత త్వరగా వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి.మల్లికార్జునరావు, జె.గట్టయ్య, కత్తెర్ల రాములు, సంద బోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల పరేషాన్



బస్సులు లేక వెలవెలబోతున్న ఇల్లెందు బస్టాండ్

ఇల్లెందు: బస్సులన్నీ సీఎం సభకు వెళ్లడంతో ఇల్లెందు బస్టాండ్ వెలవెలబోయింది. బుధవారం చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామానికి సీఎం రేవంత్‌రెడ్డి విచ్చేసిన సందర్భంగా డ్వాక్రా మహిళలను బస్సుల్లో తరలించటంతో ఇతర ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. బస్సులన్నీ సీఎం సభకు వెళ్లాయని ఆటోలు, టాటా మ్యాజిక్‌లలో వెళ్లాలని ఆర్టీసీ అధికారులు సూచిస్తుండటంతో ప్రయాణికులు అయోమయానికి గురయ్యారు. ప్రైవేటు వాహనాలు ఇష్టారాజ్యంగా బస్టాండ్‌లోకి వచ్చి ప్రయాణికులను తరలించుకు వెళ్లాయి.

ట్రాఫిక్ మళ్లింపుతో ప్రయాణికుల అవస్థలు

కొత్తగూడెంఅర్బన్: చంద్రుగొండ మండలంలో బుధవారం సీఎం పర్యటన నేపథ్యంలో కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్‌లోని కూడలి దగ్గర ట్రాఫిక్ డైవర్షన్ పెట్టడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్, హెడ్డాఫీసు మీదుగా విజయవాడ, సత్తుపల్లి, తిరుపతితో పాటుగా ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటుగా భారీ వాహనాలు రోజు వెళ్తుంటాయి. అయితే సీఎం పర్యటన ఉన్న నేపథ్యంలో పోస్టాఫీసు సెంటర్‌లో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి మీటింగ్‌కు వెళ్లే వాహనాలు తప్ప మరే వాహనాలను అనుమతించ లేదు. దీంతో ఆర్టీసీ బస్సులతో పాటుగా అన్ని వాహనాలు తల్లాడ వరకు వెళ్లి అక్కడి నుంచి వారి గమ్యస్థానాలకు వెళ్లారు.

పత్తి దిగుమతులపై నిర్ణయం మార్చుకోవాలి

పాల్వంచరూరల్: పత్తి రైతుకు నష్టం కలిగించే కేంద్ర ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని రైతు సంఘం నాయకులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, తుల సీరాం డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ముడిపత్తి దిగుమతులపై 11 శాతం సుంకాన్ని ఎత్తివేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల అనుబంధ రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా పెట్టుబడిదారులకు, విదేశీ పాలకవర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వ్యవసాయ సీజన్ మొదలై మూడు నెలలు కావస్తున్నా రైతులకు సరపడా యూరియా అందించలేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారస్ ప్రకారం పత్తికి క్వింటాకు రూ.10,075 మద్దతు ధర ప్రకటించాలని, ఆత్మహత్య చేసుకున్న రైతులకు రూ.25లక్షల చెల్లించాలని, పత్తి దిగుమతి సుంకాలపై తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కిషోర్, శనిగారపు శ్రీనివాసరావు, నిమ్మల రాంబాబు, సత్యవాణి, వెంకటేశ్వర్లు, రమేష్, పద్మ, రమేష్, మౌలాలి, కొంగర అప్పారావు, వి.రాములు, వెంకన్న పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



జూలూరుపాడులో జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

ఇల్లెందు: జిల్లాలోని చంద్రుగొండకు సీఎం రేవంత్ రెడ్డి విచ్చేసిన సభ విజయవంతం కోసం ఇల్లెందు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. బుధవారం ఇల్లెందు నియోజవర్గం నుంచి డ్వాక్రా మహిళలను ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వ యంత్రాంగం తరలించింది. ఇక ఇల్లెందు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులను, నాయకులను ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో వాహనాల్లో వెళ్లారు. ఎమ్మెల్యే కోరం కనకయ్యతో మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, నాయకులు పింగళి నరేష్, మడుగు సాంబమూర్తి, సూర్యం, శ్రీనివాస్, మండల రాము, దానియేల్, పులి సైదులు తదితరులు ఉన్నారు.

సీతారామా ప్రాజెక్టు కోసం సీఎంకు వినతిపత్రం..

సీఎం పర్యటనలో రేవంత్‌రెడ్డికి ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇల్లెందు నియోజకవర్గంలోని సాగు భూములకు సీతారామా ప్రాజెక్టు నీటిని అందించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. తెలంగాణ తొలి ప్రభుత్వంలో ఆనాటి సీఎం కేసీఆర్ బేతంపూడిలో సీతారామా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, ఆ తర్వాత అదే ప్రాజెక్టు అడ్రస్ లేకుండా పోయిందని, రానున్న కాలంలో ఇల్లెందు నియోజకవర్గంలో సీతారామా ప్రాజెక్టు చేపట్టి ఇల్లెందు సాగు భూములకు నీరు ఇవ్వాలని కోరారు.

టేకులపల్లి: దామరచర్లలో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు బుధవారం టేకులపల్లి మండలం నుంచి కోరం సురేందర్ నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సీఎం సభకు తరలివెళ్లిన వారిలో రెడ్యానాయక్, ఈది గణేష్, ఆత్మ చైర్మన్ బోడ మంగీలాల్, బండ్ల శ్రీనివాస్, రజిని, బానోతు రవి, ఉండేటి, బెంజీరావు, మధురెడ్డి, సర్దార్, పోశాలు, భద్రు, శివ, సుదీప్ ఉన్నారు.

జూలూరుపాడు: అశ్వారావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండలం దామరచర్ల గ్రామంలో బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సభకు మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు భారీగా తరలి వెళ్లారు. అధికారులు ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వెళ్లగా, ఆటోలు, ట్రాలీలు, కార్లలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సీఎం సభకు వెళ్లారు. ఆర్టీసీ బస్సులను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్, ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఎంపీఓ తులసీరామ్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, కొలిపాక వెంకటేశ్వర్లు, వేల్పుల నరసింహారావు, లకావత్ లచ్చు నాయక్, పొన్నెకంటి సతీష్ కుమార్, గోపు రామకృష్ణ, రోకటి సురేష్, చావా వెంకటరామారావు, బానోత్ లాలు నాయక్, దుద్దుకూరి సుమంత్, నరసింహారావు, బానోత్ శాంతిలాల్, రాంశెట్టి నాగేశ్వరావు, తోట శ్రీను, వాంకుడోత్ కిషన్, కొర్సా రమేష్, లేళ్ల గోపాల్‌రెడ్డి, మల్లెల నాగేశ్వరరావు, బానోత్ జగన్ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: చంద్రుకొండ మండలం బెండాలపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యక్రమానికి మండలంలోని పాండురంగాపురం, ఇల్లెందులపాడుతండా, తవిసలగూడెం గ్రామపంచాయతీల పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు, గ్రామ సమాఖ్యలు, గ్రామపంచాయతీ సిబ్బంది, నాయకులు బుధవారం ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు.



టేకులపల్లి నుంచి బయలుదేరుతున్న నాయకులు



పాల్వంచరూరల్: పాండురంగాపురం నుంచి వెళ్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు



ఇల్లెందు: చంద్రుగొండలో డ్వాక్రా మహిళలు

మహా గణపతిం భజే!

కొత్తగూడెంటౌన్: శ్రీ విజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేష్ టెంపుల్)లో గణపతి నవరాత్రుల బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి పట్టణంలో స్వామి వారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, నృత్యాలతో రహదారుల్లో ఆధ్యాత్మికం వెల్లివిరిసింది.

పాల్వంచరూరల్: స్థానిక రాహుల్‌గాంధీ నగర్‌లో ఆదర్శ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గణపతి మండపంలో బుధవారం భక్తులు హోమం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూచి శ్రీనివాసరావు, కర్నాటి వేణు, కట్ట రాంబాబు, ఇంజన్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెంటౌన్: గణేష్ టెంపుల్ నుంచి రథోత్సవం

జూలూరుపాడు: బుధవారం పలు గ్రామాల్లో గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. జూలూరుపాడు న్యూకాలనీ, కాకర్ల శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం, పాపకొల్లు తదితర గ్రామాల్లోని గణేష్ మండపాల వద్ద అన్నదానం చేశారు. జూలూరుపాడు న్యూకాలనీలో దాతలు కళ్లోజి పాపయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు రామారావు, విజయ్‌కుమార్, మురళీ అన్నదానం నిర్వహించారు.

ఇల్లెందు: ఇల్లెందు కోర్టు సమీపంలో వినాయక మండపం వద్ద ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాంపల్లి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తికార్తీక్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ టి.ఇందిర, సీనియర్ న్యాయవాదులు వాంకుడోతు తార, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలోని పలు గ్రామాలలో బుధవారం విఘ్నేశ్వరునికి భక్తులు పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు గణపతి మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

టేకులపల్లి: బుధవారం రాత్రి టేకులపల్లి సెంటర్‌లో గణేష్ మండపం వద్ద సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. కోలాటం ఆడారు. బోడ బజారులో అన్నదానం నిర్వహించారు.



టేకులపల్లి సెంటర్‌లో సహస్ర దీపాలంకరణ



ఇల్లెందు: అన్నదానం ప్రారంభిస్తున్న జడ్జి కీర్తిచంద్రికారెడ్డి



ఇల్లెందురూరల్: బాలాజీనగర్‌లో అన్నదానం



జూలూరుపాడు న్యూకాలనీలో ..



పాల్వంచరూరల్: రాహుల్‌గాంధీ నగర్‌లో..